# పతుల కోసం సతుల ప్రచారం



ఏర్గట్లలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వేముల సతీమణి వేముల నీరజారెడ్డి



చీమన్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి సతీమణి వినోదమ్మ

మోర్తాడ్/ వేల్పూర్/ఏర్గట్ల/ఆర్మూర్/నవీపేట/ ఖలీల్‌వాడి, నవంబర్ 20: బాల్కొండ, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులను మరోసారి ఆశీర్వదించాలని వారి కుటుంబ సభ్యులు కోరారు. మంత్రి వేముల, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్, బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా వారి సతీమణులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మోర్తాడ్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల్లో మంత్రి వేముల సతీమణి నీరజారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాక్లూర్ మండలంలోని మానిక్‌బండార్, బోర్గాం, మానిక్‌బండార్ తండాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సతీమణి లతా బిగాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవీపేటలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిరికొండ మండలం చీమన్‌పల్లిలో నిర్వహించిన ప్రచారంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సతీమణి వినోదమ్మ పాల్గొన్నారు.



మానిక్‌భండార్ తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి



జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల సతీమణి లత



నవీపేట లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయోషా ఫాతిమా

# బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 20 : బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా ఏర్గట్ల మండలం బట్టాపూర్ నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు రమేశ్‌నాయక్, మంగ్యానాయక్, శివకుమార్‌నాయక్, రాజేశ్‌నాయక్, భీమానాయక్, మోహన్‌నాయక్, హరీశ్, తిరుపతి, గంగాధర్ శ్రీనివాస్, కె. గంగాధర్, బడాభీమ్‌గల్ నుంచి గౌడ సంఘం సభ్యులు, యువజన సభ్యులు, వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామం నుంచి రిక్క రాజన్న, బన్న రంజిత్, గుట్ట వడ్డెర కాలనీ ప్రభాకర్, కార్యకర్తలు ధర్మోరా నుంచి బీజేపీ ఎస్టీ మోర్చా సభ్యులు, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు దేగాం రాజేశ్వర్, ఏలేటి మహిపాల్, అబ్కా ధర్మయ్య, ముప్కాల్ నుంచి ముఖీద్ సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు.

**కాంగ్రెస్ నుంచి గులాబీ గూటికి..**

భీమ్‌గల్, నవంబర్ 20: భీమ్‌గల్ పట్టణానికి చెందిన మజీద్ ఇమామ్ మౌలానా జమీల్ కాంగ్రెస్ నుంచి తిరిగి మంత్రి వేముల సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు వేముల గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**వేములకు బడాభీమ్‌గల్ గూండ్ల సంఘం మద్దతు**

బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గూండ్ల సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీని వేల్పూర్‌లో మంత్రి వేములకు సోమవారం అందజేశారు.

# సంక్షేమ పథకాల్లో గల్ఫ్‌కార్మికులకు ప్రాధాన్యం

## గల్ఫ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి

కమ్మర్‌పల్లి, నవంబర్ 20 : గల్ఫ్ నుంచి తిరిగి వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గల్ఫ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. గల్ఫ్ దేశంలో ఇప్పటికే పని చేస్తున్న వారు దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రైతుబీమా తరహాలో 5 లక్షల కేసీఆర్ బీమా కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అక్కడ పని చేస్తున్న కుటుంబాలు తిరిగి వచ్చిన వారు ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం ఆయన కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు నాగపూర్, హాసాకొత్తూర్, బషీరాబాద్, చౌట్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. గల్ఫ్ దేశాల నుంచి తిరిగి వచ్చి ఇక్కడ స్థిరపడిన కార్మికులను కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కమ్మర్‌పల్లి సర్పంచ్ గడ్డం స్వామి ఆధ్వర్యంలో గడ్డం స్వామి విశ్రాంతి గృహంలో నిర్వహించిన సమావేశంలో కోటపాటి మాట్లాడారు. గల్ఫ్ కార్మికులు తామంతా వేముల వెంటే ఉంటామని హామీనిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం రాజేశ్వర్, చింత గణేశ్, ఉప సర్పంచ్ పాలెం చిన్నగంగారాం పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో గల్ఫ్‌కార్మికులతో సమావేశమైన కోటపాటి నర్సింహనాయుడు

# జడ్పీ చైర్మన్ వాహనం తనిఖీ



జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నందిపేట్, నవంబర్ 20: మండలంలోని రైతుఫారం వద్ద సోమవారం ఎన్నికల సిబ్బంది జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నందిపేట్ వైపు వస్తుండగా నందిపేట్-నిజామాబాద్ రైతు ఫారం వద్ద ఎన్నికల సిబ్బంది వాహనాన్ని తనిఖీ చేశారు. జడ్పీ చైర్మన్ వారికి సహకరించగా వాహనమంతా తనిఖీ చేశారు.

# కాలువలో పడి యువకుడి మృతి

బాల్కొండ, నవంబర్ 20: మండలంలోని బోదేపల్లి గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్ (26) బస్సాపూర్ గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరద కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై గోపి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్ర భుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## పోలింగ్ నిర్వహణ తీరును
# నిశితంగా పరిశీలించాలి

### మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు




మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి, నవంబర్ 20: ఎన్నికల్లో పోలింగ్ అతి కీలకమైందని, ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తప్పకుండా అమలయ్యేలా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియామకమైన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాధారణ పరిశీలకులు గౌతమ్ సింగ్, సుబ్రా చక్రవర్తి, లలిత్ నారాయణ్‌సింగ్ హాజరై మైక్రో అబ్జర్వర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరు సెగ్మెంట్ల పరిధిలో 500 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని, మొదటి విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ర్యాండమైజేషన్ జాబితాను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన బాధ్యతలు కేటాయిస్తామన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగలుగుతారన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 7 గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకుని సిబ్బందికి అందించే సామగ్రి సక్రమంగా అందిందా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారు మినహా, ఇతరులెవరికీ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రావు, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మైక్రో అబ్జర్వర్లు